# పట్టుదల - పర్యవసానము

పాలెపు నరసింహం

కారణాంతరాలవల్ల బి. యస్సీ మూడవ సంవత్సరం రాజమండ్రీలో చదవ వలసి వొచ్చింది. అప్పుడే మూర్తితో పరిచయం ఏర్పడింది. శర్మ అతన్ని నాకు మొదటిసారిగా పరిచయం చేసాడు. నా గురించి రెండు మూడు వాక్యాలు చెప్పిన తరవాత అతన్ని చూపించి 'ఈయన మూర్తి. చాలా బ్రిలియెంట్ నాకు కావలసిన ముఖ్య స్నేహితుల్లో ఒకడు'— అన్నాడు. నమస్కారం చేసాడతను. నేనూ తిరిగి నమస్కారం చేసాను. ఎక్కువగా అతనితో మాట్లాడటానికి అవకాశం లేక పోయింది అవేళ. శర్మ మూర్తి ఏవో వాళ్ళ విషయాలు మాట్లాడుకో సాగారు. నేను మౌనంగా వుండిపోయాను. ఓమారు మూర్తి వుంటోన్న గదినంతా పరిశీలనగా చూసాను. చిన్నగది, పరిశుభ్రంగా లేవు పరిసరాలు వేటికవి చెల్లాచెదురుగా పడివున్నాయి. అలంకరణ, గది శుభ్రత వీటిపట్ల అభిరుచి అతనికి లేకపోవడం అంతర్గతంగా అతనిలో గూడు కట్టుకుని వున్న నిర్లక్ష్యానికి నిదర్శనమేమో! నే నిట్లా అనుకోవడం నిజానికి దూరం కావొచ్చు. అయినా మూర్తి మాటలు వింటోన్నకొద్దీ నాఅభిప్రాయం బలపడసాగింది. అప్పటికి కాలేజీ తెరిచి పదిరోజులన్నా కాలేదు మాది ఫిజిక్సుగ్రూపు. యింకా వో క్రమంలో పాఠాలు ప్రారంభం కాలేదు. మూర్తి టేబుల్ మీద డంకన్, స్టార్లింగ్, నారాయణ్ లాంటి వాళ్ళు వ్రాసిన ఫిజిక్సుపుస్తకాలు వివిధ రకాలైనవీ కనిపించాయి. చదువుపట్ల అతనికిగల అభిరుచికి, చూపించే శ్రద్ధకీ నాకు ఆశ్చర్యం వేసింది బైటికి వొచ్చేస్తూండగా అసలేమీ మాట్లాడకపోతే బావుండదని అడిగాను "అప్పుడే మంచి పుస్తకాలన్నీ సంపాదించారే యిప్పటినుంచి చదువుతున్నారా యివన్నీ'

"అవునండి. అసలు ఏ చిన్న గైడువంటిదో చదివితే చాలు పరీక్షలకి. కాని నా ధోరణి పూర్తిగా భిన్నం. ఏ చిన్న విషయాన్నయినా తరచి— పరిశీలిస్తే కాని సంతృప్తి వుండదు. మన యిండియన్ - ఎడిషన్సులో విషయం తక్కువగా వుంటుంది. అందుకనే ఈ పుస్తకాల్ని ఏరి ఏరి తెచ్చాను. యిప్పటినుంచీ చదివితే కాని క్లాసులో పరీక్షలు నెగ్గుకు రాలేము. ఈ ఏడాది క్లాసు రాకపోతే తరవాత విచారించీ ప్రయోజనంలేదు - " అన్నాడు. నాకు వెంటనే ఏం మాట్లాడాలో తెలీక వూరుకున్నాను. యింటికి వొస్తూంటే శర్మ అన్నాడు అతను మాట్లాడిన తీరు నీకు కొంచెం ఆశ్చర్యమనిపించిందికదూ! మూర్తి కథలుకూడా వ్రాస్తాడు. పట్టుదల మనిషి. నిత్యజీవితంలోకూడా కథల్లో పాత్రలు మాట్లాడుకున్న విధంగానే గంభీరంగా మాట్లాడతాడు. ఎటొచ్చీ యితని తత్వం తెలిసిన దగ్గిర మిత్రులు ఏదోవిధంగా సర్దుకుపోతారు కానీ కొత్తగా పరిచయమైన వాళ్ళకి ఎబ్బెట్టుగా వుంటుంది అతని సంభాషణ" మూర్తి సంభాషణ మరోసారి జ్ఞాపకానికి తెచ్చుకున్నాను. అయితే ఎక్కువగా కథలు చదివే అలవాటు నాకు లేదు కనక, మూర్తి సంభాషణల మీద ఏ కామెంటూ చెయ్యలేదు. 'ఆలాగా' అన్నాను.

♦ ♦ ♦

మార్చి 30 సమీపించింది. పరీక్షలు దగ్గిరపడ్డాయి. నేను పూర్తిగా చదువుల్లో మునిగిపోయాను. నిద్రిస్తోన్నా ఆ న్యూటన్ సిద్ధాంతాలు, ఎలక్ట్రికల్ డయాగ్రమ్సు నా కళ్ళ ముందు తారసపడేవి, ఒకటొక్కటిగా నా ఆలోచనలు, ఊహాలు

అన్నీ ఫిజిక్సు కేంద్రం చుట్టూ తిరగ సాగినాయి. పరధ్యానం ఎక్కువయింది, నేనో వింత మనిషిల్లే మారిపోయాను. అప్పుడప్పుడు నా స్థితిని తలుచుకున్నప్పుడల్లా నాకే భయం వేయసాగింది. ఏదైనా ఒక లక్ష్యాన్ని మనం సాధించదలుచుకొన్నప్పుడు ఆ విషయంలో తప్ప మిగిలిన అంశాలు తమ ప్రాముఖ్యతని పోగొట్టుకుంటాయనుకుంటాను పరీక్షలు ప్రారంభమైన మూడో రోజున తెలిసింది మూర్తి పరీక్షలకి రావడంలేదనీ విత్‌డ్రా అయినాడనీ, నా ఆశ్చర్యానికి అంతులేదు. పరీక్షలు ప్రారంభమౌతాయన్న పదిరోజులు ముందుగా చదవడం ప్రారంభించిన నాలాంటి విద్యార్థులందరమూ పేపర్లుచూసి సంతృప్తి పడ్డాము. ఆ ఏడాదిపేపర్లు చాలా సులువుగా వున్నాయని లెక్చరర్లు సైతం ఒప్పుకున్నారు. మరి కాలేజీ ప్రారంభమైన మొదటి రోజునించీ శ్రమపడి చదివిన మూర్తి పరీక్షలకి రావడం లేదంటే అంత కన్న ఆశ్చర్యం కలిగించే విషయమేముంటుంది?

రాత్రి నేను, శర్మ అడిగాము. ఏమిటిది నిజమేనా? అని "అవును యిట్లా అవుతుందని నాకు తెలుసు. యిప్పుడు నేను పరీక్షలకి కూర్చుంటే అధమం సెకండ్ క్లాసన్నా రాక పోదు. కానీ నా ప్రయత్నమంతా వృధా మొదటిపేపరు కొంచెం పాడుచేసాను. ఫస్టుక్లాసులో పాసయితే కాని మనకి గతిలేదు. సెకండ్ థర్డు క్లాసులో వుత్తీర్ణులైన వాళ్ళకి ముందు ముందు భవిష్యత్తు లేదు అందుకనే దూరదృష్టితో ఆలోచించి మరీ ఈనిర్ణయానికివొచ్చాను" అన్నాడు మూర్తి. తేలిక పడిన మనస్సులతో యింటికి వొచ్చాము. శర్మని అడిగాను నేను: నిజంగా క్లాసుకోసమేనా యితను విత్‌డ్రా అవుతోంట' - అని. "కావొచ్చు. నేను ముందే చెప్పానుగా పట్టుదల మనిషి అని. అనుకున్న లక్ష్యాన్ని సాధించేవరకూ వూరుకోడు ఎన్ని అవాంతరాలు వొచ్చినా సరే"- అన్నాడు శర్మ సీరియస్‌గా. మరింక మూర్తి ప్రస్తావన తీసుకురాలేదు నేను.

◆ ◆ ◆

పరీక్షా ఫలితాలు తెలిసాయి. నేను థర్డుక్లాసులో పాసయ్యాను. శర్మకి సెకండ్‌క్లాసు వొచ్చింది. ఏ యూనివర్సిటీలోనూ సీటు లభించక పోవడంవలన నేను వుద్యోగం కోసం అన్వేషించవలసి వొచ్చింది. అదృష్టంకొద్దీ నాలుగునెలల్లో వుద్యోగం దొరికింది నాకు రామచంద్రపురం స్టేటుబ్యాంకులో. శర్మకి సాగర్ యూనివర్సిటీలో సీటు దొరికింది వెంటనే వెళ్ళిపోయాడు. అప్పుడప్పుడు వో వుత్తరం వ్రాస్తూ వుండేవాడు క్లుప్తంగా-అక్కడ తన చదువు గురించీ, తనకి క్రొత్తగా పరిచయమైన స్నేహితుల గురించీ రాను రాను శర్మ వుత్తరాలు వ్రాయడం మానుకున్నాడు


# శుభవార్త

డాక్టర్లచే సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్టు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేని వారు గూడ శ్రీ యోగి గారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్స వల్ల దేహములోవున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును.
వివరములు కోరువారుపోస్టుఖర్చులకుఒకరూపాయి పంపవలయును.

అడ్రసు:
యోగాశ్రమము
P. O. పెదవాల్తేరు
విశాఖపట్టణము - 3



చదవండి — చందాదారులుగా
చేరండి.
ఆంధ్రుల అభిమాన పక్షపత్రిక
చుక్కాని
సాలు చందా 4-50 విడిప్రతిక 20 నయాపైసలు

విద్యార్థి దశలో అనుకుంటాము మనం ఏర్పరుచుకున్న ఈ స్నేహాలు స్థిరమై నిలుస్తాయనీ, భౌతికంగా దూరమైనా ఉత్తరాల్లోంచి స్నేహాన్ని బలపరుచుకోవచ్చుననీ. జీవితంలోకి అడుగు దగ్గిన్నుంచీ మనకి తెలీకుండానే మిత్రులందరూ ఒక్కొక్కరుగా జారిపోతారు. చివరికి మనం ఒక్కళ్ళమూ మిగులుతాము. మహావేగంతో ప్రవహించే ఈజీవిత ప్రవాహంలో చిన్ననాటి కలలు, స్నేహాలు, బంధుత్వాలు - యివన్నీ దహితమౌతాయి. ఏ జీవితపు మరో జంక్షన్‌లోనో కలుస్తాము, ఎప్పుడు గతించిన దినాల్ని ఆ రోజులనాటి స్వాతంత్ర్యాన్ని విద్యార్థిదశలోని మధురత్వాన్ని జ్ఞాపకం తెచ్చుకుని ఆ కొద్దినిముషాలూ ఆనందపడతాము ఆ నిమిషం గడవగానే మళ్ళీ ఎవరివారే! యిట్లా జరగడం ఆశ్చర్యమేమీ కాదు చాలా సహజం.

ఉద్యోగంలో జేరిన మరుసటి సంవత్సరం బ్యాంకు పనిమీద రాజమండ్రీ వెళ్ళాను. కాంతారావు అని మా బంధువు కుర్రాడు వొకడు కాలేజీలో చదువుతూంటే వాడి రూములో దిగాను. సాయంత్రం నేను, కాంతారావు శాంతినివాస్‌లో కాఫీ త్రాగుతోంటే మూర్తి కనిపించాడు. నన్ను చూసినా గుర్తుపట్టనట్లు నటించి అక్కణ్ణించి దూరంగా తొలగి పోవడానికి అతనుచేసే ప్రయత్నాల్ని నేను వోకంట గమనిస్తూనే వున్నాను. నెమ్మదిగా బైటికి జారుకోబోతున్నాడు. నేను పిలిచాను 'మూర్తిగారూ' అని గత్యంతరంలేక వెనక్కితిరిగి నవ్వాడు. ఆనవ్వులో ఏదో అసహజత గోచరించింది నాకు తప్పుచేసి దొరికి పోయినప్పుడు వ్యక్తి ప్రవర్తన ఎట్లా వుంటుందో— ఆ సాయంత్రం మూర్తి సంభాషించిన తీరు - విలక్షణమైన అతని ధోరణీ అట్లా అనిపించి నన్ను ఆశ్చర్యచకితుణ్ని చేశాయి. ముక్తసరిగా నాలుగు ముక్కలు మాట్లాడి అవసరమైన పనివుందని వెళ్ళిపోయాడు. మూర్తి వెళ్ళిపోయాక 'నీకు తెలుసునా ఏమిటి యితను?'— అన్నాడు కాంతారావు.

"అవును. మాతో చదువుకున్నాడు. యిప్పుడేం చేస్తున్నాడో!" అన్నాను.

"ఏం చెయ్యడమేమిటి? పరీక్షలకి వొస్తున్నాడు యింకా యిప్పటికీ. పెద్దనయ్యా అని హేళనచేస్తారు విద్యార్థులంతా చాలా ఏళ్ళనుంచీ వొస్తున్నాడు పరీక్షలకి ప్రతిసారీ గ్రూపులో ఒక్కొక్క విభాగంలో వుత్తీర్ణుడవుతున్నాడు. అయినా వాటిని కేన్సిల్ చేయించుకుని మూడింటికీ వొస్తాడు ఎవరో అడిగితే చెప్పాడు అరవయ్యో కాన్వొకేషన్ కయినా ఫస్టుక్లాసులో డిగ్రీ తీసుకుని తీరతాననే నమ్మకం నాకు— అని." వకబిగిన చెప్పాడు కాంతారావు.

కాంతారావు మాటలు విన్న తరువాత మూర్తిపైన జాలికలిగింది. అయితే మూర్తిపట్ల హృదయంలో ఏర్పడిన అపేక్షని ముఖ కళవళికల్లో వ్యక్తపరచకుండా జాగ్రత పడ్డాడు. కొన్నికొన్ని విషయాల్లో మనుషులు ఎందుకు మూర్ఖంగా ప్రవర్తిస్తారో! సంస్కారం లేనివ్యక్తి ఏ ఆలోచనా లేకుండా గుడ్డిగా ప్రతివిషయాన్ని నమ్మి ఆచరించి భంగపడే వ్యక్తి యిట్లాంటి తెలివితక్కువ నిర్ణయాలకి రావడంలో కొంత అర్థమున్నది కాని భావుకుడూ ప్రతివిషయాన్ని ఓక్రమంలో నడిపించడానికిఅలవాటు పడినవాడూ మూర్ఖంగా ప్రవర్తించడాన్ని హర్షించలేము. అవతలివ్యక్తి మనకి ఎంతసన్నిహితుడయినా సరే.

అయితే మూర్తిపట్ల ఎందుకంత ఆపేక్ష ఏర్పడిందో చెప్పలేను నేను. మనస్తత్వశాస్త్రానికి సైతం అందని విషయాలుకొన్ని వుంటాయి. అట్లాంటి వాటిలో నా మనస్తత్వం కూడా వొకటని అనుకోవడం కన్న మరేవిధంగానూ నా వాదాన్ని సమర్థించుకోలేను. మర్నాడు రామచంద్రపురం వొచ్చేశాను నేను.

◆ ◆ ◆

నాలుగు సంవత్సరాల తరువాత—

(తరువాయి 15 వ పేజీలో)

## పట్టుదల — పర్యవసానము

(12 వ పేజీ తరువాయి)

ఓ రోజున బెజవాడ ప్లాట్‌ఫారమ్‌మీద శర్మ కనిపించాడు. అక్కడే లయోలా కాలేజీలో పని చేస్తున్నాడట. రెండు రోజులన్నా వుండి వెడితే కాని వీలులేదని బలవంతం చెయ్యడంతో నా ప్రయాణం మానుకుని వుండిపోయాను. సాయంత్రం యిద్దరం షికారుగా క్రిష్ణబడ్డుకి వెళ్ళి కూర్చున్నాము. వాతావరణం చాలా హాయిగా ప్రశాంతంగా వుంది. మాతో బాటు కలిసి చదువుకున్న మిత్రులు యిప్పుడెక్కడ ఏం చేస్తున్నారోనని తర్కించుకోవడంలో మూర్తి ప్రస్తావన వొచ్చింది.

"మూర్తి ఎక్కడ వుంటున్నాడో తెలుసా నీకు ? నాలుగేళ్ల క్రితం నాకు రాజమండ్రిలో కనిపించాడు. యింకా పరీక్షలకి కూర్చుంటూనే వున్నాడట—" అన్నాను నేను

"అన్నట్లు చెప్పడం మరచాను. చాలా తమాషా సంఘటన వొకటి జరిగింది విశాఖపట్నంలో మూర్తి అట్లా ప్రవర్తిస్తాడని అనుకోలేదు నేను" అన్నాడు శర్మ.

"ఏం జరిగిందసలు ? అన్నాను కుతూహలంగా.

" రెండు సంవత్సరాల క్రితం కొత్తగా ఎమ్మెస్సీ పాసయిన తరవాత విశాఖపట్నం కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్ వుద్యోగం దొరికింది. వెళ్లి జాయినయ్యాను. ఆ సంవత్సరం యూనివర్సిటీ పరీక్షల్లో నేను వాచర్‌గా పని చెయ్యవలసి వొచ్చింది. పరీక్షలు ప్రారంభమైన రెండో రోజున వో పావుగంట ముందుగా వొచ్చి కాంపౌండులో తిరుగుతున్నాను. అక్కడే నోటీసు-బోర్డు చూస్తో మూర్తి కనిపించాడు. వెళ్ళి పలకరించి ఏమిటీ యిట్లా వొచ్చావు అని అడిగితే—'మా బంధువులకుర్రాడు ఒకడు పరీక్షలకి వొస్తూంటే వాడితో బాటు వొచ్చాను–' అన్నాడు.

"ఏం చేస్తున్నావని అడిగితే బియ్యేస్సీ ఫస్టుక్లాసులో పాసయినాననీ, ఉద్యోగ ప్రయత్నంలో వున్నాననీ చెప్పాడు. యింతకీ నేను ఆ కాలేజీలో డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేస్తున్నానన్న విషయం అతనికి తెలీదు–" అని ఆగాడు శర్మ వో క్షణం.

" తరవాత ఏం జరిగింది – " అన్నాను నేను.

"మూర్తి బియ్యేస్సీ పరీక్షలకి వొచ్చాడు. సెంటర్ మార్చాడన్న మాట. అతను కూర్చున్న గదిలోకే నేను వాచర్‌గా వెళ్ళవలసివొచ్చింది" అన్నాడు శర్మ. నా కళ్ళముందు మూర్తి విగ్రహం మెదిలింది. అతని మనస్తత్వమేమిటో నాకు అవగాహన కాలేదు. ఎంతకాలమిట్లా తనని తాను వంచించుకుంటాడు ? ఒకనాటికయినా తన పరిస్థితిని గుర్తించలేడా? యిట్లా చీకటినీడల్లో అతని జీవితమంతా గడిచిపోవలసిందేనా ?

ఫాల్స్‌ప్రిస్టేజీ- అన్నపదం ఒకటి వుంది యింగ్లీషులో స్వతహాగా స్తోమతలేకపోయినా, ఆడంబరం నటించే వ్యక్తి తరహాన నిర్వచించడానికి పై పదాన్ని వుపయోగిస్తూ వుండటం అలవాటు మూర్తికూడా ఈ ఫాల్స్‌ప్రిస్టేజ్‌కోసం ప్రాకులాడుతున్నాడనిపిస్తుంది. కాకపోతే క్లాసులో కాకపోయినా మామూలుగానైనా ఏనాడో వుత్తీర్ణుడై వుండేవాడు. కానీ ఆవిధమైన ఫలితాన్ని సాధించడంలో అతనికి సంతృప్తిలేదు. అందుకనే ఈ సంఘర్షణలో నిరంతరం సతమతమాతున్నాడు. కనుచీకటి పడుతూంటే యింటికి బయలుదేరాము.

◆ ◆ ◆

మరో సంవత్సరం వడిచింది. ఒకరోజున అనుకోకుండా కాంతారావు అమలాపురం వెడుతూ కనిపించి జ్ఞాపకంచేసినదాకా మూర్తినిమరచాననే చెప్పాలి. బస్సుస్టాండులో కలిసాడు కాంతారావు. చదువుపూర్తి చేసి, ఫారెస్టు డిపార్టుమెంటులో పని చేస్తున్నాడట. బస్సు పదినిముషాల

(తరువాయి 17 వ పేజీలో)

## పట్టుదల – పర్యవసానము

(15 వ పేజీ తరువాయి)

మాత్రం ఆగుతుంది స్టాపులో, హోటల్లో కాఫీలు తాగిన తరవాత కాంతారావు బస్సు ఎక్కాడు. నేను సెలవుతీసుకుందామని అనుకుంటూ 'మరింకేమిటి విశేషాలు?' అన్నాను యధాలాపంగా.

“ఏమున్నాయి విశేషాలు ? పెద్దన్నయ్య వేదాంత భ్రమలోపడ్డాడు. అది ఒక్కటే చెప్పదగిన పెద్దవిశేషం–” అన్నాడు కాంతారావు. మూర్తిపట్ల కాంతారావుకి ఏనాడూ మంచి అభిప్రాయంలేదు అందుకనే మూర్తిపట్ల అతను పెంచుకున్న నిర్లక్ష్యం అతని మాటల్లో స్పష్టంగా వ్యక్తమైంది.

“ఎవరు ? మూర్తిని గురించేనా నువ్వు చెబుతోంట–” అన్నాను ఆత్రుత అణుచుకోలేక

“అవును. ఆమధ్య గుంటూరు రైల్వేస్టేషన్‌లో కనిపించాడు అతను ధరించినవి కాషాయరంగువస్త్రాలు. ఎటో దిగులుగా శూన్యంలోకి చూస్తున్నాడు వో సిమ్మెంటు బెంచీ మీద కూర్చుని మొదట్లో నమ్మలేకపోయాను. వెళ్ళి పలకరించాను. చాలాసేపటివరకూ నన్ను గుర్తుపట్టలేకపోయాడు. రైలు వొచ్చేవరకూ ఓ గంట అతనితో గడిపాను. “వివేకానంద, రామకృష్ణ పరమహంస–వీళ్లు చూపించిన వెలుగులో నడవటమే తన ధ్యేయమన్నాడు. మృత్యువు తరవాత 'నేను' అన్న భావం రహితమౌతుంది గాలిలో శూన్యంలో, కాంతిలో ఐక్యమవడమే చివరకి మిగిలింది” అన్నాడు. నాకు నవ్వు ఆగింది కాదు.” ఆ క్షణాల్ని గుర్తుకు తెచ్చుకుని కాంతారావు అదేపనిగా నవ్వుతున్నాడు. కాంతారావు మాటల ఆధారంతో మూర్తి స్వరూపాన్ని వూహించడానికి ప్రయత్నించాను. కాని ఆ ప్రయత్నం నా వూహకి అతీతమైనదనిపించింది. కండక్టర్ విజిల్ వెయ్యడంతో దుమ్ము రేపుకుంటూ బస్సు కదిలింది. కాంతారావు నవ్వు ముఖం నానుంచి దూరమయింది

రాత్రి చాలాసేపు మూర్తి విషయమై ఆలోచిస్తూ వుండిపోయాను. ఏ విధంగానూ ఆలోచనలో ఒక నిర్ణయానికి చప్పున రా లేకపోయాను. మొదట్లో అయోమయమనిపించినా రానురాను వో వూహ స్థిరపడసాగిందిమూర్తిమీద కథ రాయాల్సి వొస్తుందని ఏనాడూ అనుకోలేదు నేను. ప్రతివ్యక్తి జీవితాన్నీ తరచి–తరచి పరిశీలిస్తే వో నవలకి– కనీసం కథకి తగిన వొస్తువు లభిస్తుందని సాహిత్యవేత్తలు అంటో.వుంటారు. నిజమో కాదో నాకు తెలీదు కానీ, పెద్దగా పరిచయంలేక పోయినా, మూర్తి అంతరంగికమైన విషయాలు ఎక్కువగా నాకు తెలీకపోయినా వో కథ వ్రాయాలనిపించింది. ముగింపు యిట్లా కాకుండా మూర్తి పట్టుదలతో చదివి చివరికి క్లాసులో వుత్తీర్ణుడైనాడని వ్రాస్తే– కథకి వొక రకమైన విలువ, తలపెట్టిన సమస్యకి పరిష్కారం చేకూరుతాయేమో కానీ, అలా కల్పనలో సంతృప్తిపడలేను నేను. వాస్తవిక దృశ్యాల్ని యధాతథంగా వ్రాస్తే వాటిల్లో కళ ఎంతవరకూ ప్రతిబింబిస్తూ వుంటుంది? అనేది సందేహాస్పదమైన విషయమే ఏది ఏమైనా నా మట్టుకు నాకు, మూర్తి విషయమై తెలిసింది వ్రాయడంవలన కొంత గుండెలబరువు తీరినట్లయింది. అంత హఠాత్తుగా అతను విరక్తి చెందడానికి కారణమేమిటో వూహించాను నేను అదేమిటో చెప్పి పాఠకుల కాలాన్ని వ్యయపరచ దలుచుకోలేదు – ఎందువల్లనంటే నేను తర్కించే అవసరం లేకుండా ముందుగానే పాఠకులు వో అభిప్రాయాన్ని ఏర్పరుచుకుని వుంటారన్న గట్టి నమ్మకంతో ముగింపు పాఠకులకే వొదిలేస్తున్నాను.

